# కొనసాగుతున్న పంజాబ్ రైతాంగ సమైక్య ఉద్యమం

**ఫాసిస్టు** తరహా మోడీ ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడటానికి పంజాబ్ రాష్ట్రంలో కలిసి వచ్చిన 31 కిసాన్ సంస్థల పిలుపుకి కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, మండి కమిషన్ ఏజెంట్లు, యువత, విద్యార్థులు మరియు 100 వరకు చిన్న పెద్ద సంస్థలు రైతులకు మద్దతుగా నిలిచాయి. రైతులు సెప్టెంబర్ 24 నుండి 26 వరకు 3 రోజులు రైలుపట్టాలపై రైళ్లు తిరగనివ్వకుండా బందు చేయడానికి పిలుపిచ్చారు. అనుకున్నట్టుగానే ఇది విజయవంతమైంది. తర్వాత సంఘర్ష్ కమిటీ రైల్‌బ్లాక్‌ను 29 వరకు పొడిగించింది. రచయితలు, గాయకులు మరియు ఇతర సాంస్కృతిక సంస్థలు అనేకమంది వ్యక్తులు కూడా రైతాంగానికి మద్దతుగా రోడ్లపైకి వచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళా రైతులు చాలా చోట్ల పోరాటంలో ముందుపీఠిన వున్నారు. కళాశాల, పాఠశాల ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదుల సంఘాలు, మానవహక్కుల సంస్థలు, పోలీసు పెన్షనర్ల సంఘాలు కూడా బంద్‌లో పాల్గొన్నాయి. 25న బంద్‌లో భాగంగా పంజాబ్‌లోని 400 ప్రదేశాలలో ప్రజలు మాస్ ధర్నాలు, రైల్ మరియు రోడ్డురోకో కార్యక్రమాలను నిర్వహించారు.

సెప్టెంబర్ 25న పంజాబ్ బంద్ విజయవంతంగా పూర్తయిన తరువాత, పంటకోతల కాలం అయినప్పటికీ 31 కిసాన్ సంస్థలు అక్టోబర్ 1 నుండి రైలు రవాణాను నిరవధికంగా అడ్డుకోవాలని నిర్ణయించాయి. రైతుల, కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకమైన క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా వీధి నాటక బృందాలు తయారయ్యి పంజాబ్ గ్రామాలకు బైలుదేరాయి. పంజాబ్‌లోని రైతులు ఒక్క గొంతులో అంబానీ మరియు అదానీల వ్యాపారాలు మరియు ఉత్పత్తులను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

అక్టోబర్ 1 నుండి నిరవధిక రైలు రోకో ఆందోళనను తిరిగి ప్రారంభించారు. అంబానీ మరియు అదానీల మాల్స్, పెట్రోల్ బంకులు, మొబైల్ సేవలు, మొదలైన అన్ని ఉత్పత్తులు, సేవలను ప్రజలు బహిష్కరించడం కొన సాగిస్తున్నారు. రాష్ట్ర మరియు జాతీయ రహదారులపై నిర్మించిన టోల్ ప్లాజాలను అధీనంలోకి తీసుకున్నారు. ప్రజలు ఎటువంటి టోల్ ఫీజు చెల్లించకుండా వెళ్లిపోవాలని వాహనదారులను కోరుతున్నారు. యువత మరియు ఇతర ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో చేరడంతో ఇది ప్రజల ఉద్యమంగా మారింది. 'డెమోక్రాటిక్ ములాజిమ్ ఫ్రంట్' అన్న ఐక్య కార్యాచరణ సంస్థ పేరుతో ఉద్యోగసంఘాలు అమృత్సర్ జిల్లాలో రైల్వేస్టేషన్లలో ధర్నాలో రైతులకు సంఘీభావం తెలపడంతో రోజూ ఒంటిగంట నుండి 4 గంటల వరకు కొనసాగేలా సంఘీభావం తెల్పటం, పంజాబు రాష్ట్రంలో ఒక సామూహిక ఉద్యమానికి దారితీసింది. పంజాబ్ ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు భారతీయ విద్యార్థులు కెనడాలో ఈ నల్ల చట్టాలను నిరసిస్తూ, రాష్ట్ర పాలకులు తీసుకున్న అవకాశవాద వైఖరికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపారు.

సెప్టెంబర్ 6వ తేది నుండి అమృతసర్ జిల్లాలో ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి ఉద్యోగుల సంస్థలు ముందుకు వచ్చాయి. పాటియాలా జిల్లాలోని శంభువద్ద సెప్టెంబర్ 6న రైల్వే ట్రాక్‌ను అడ్డుకుని క్రాంతికారి కిసాన్ యూనియన్ కార్యకర్తలు ఆందోళన చేశారు. 17 కిసాన్ సంస్థల పిలుపు మేరకు, విద్యార్థులు, యువత, ఉద్యోగుల సహకారంతో 6వ తేదీన సిర్సా(హర్యానా)లో వేలాదిమంది ప్రజలు గుమిగూడారు. ప్రజలు శాంతియుతంగా ఉద్యమిస్తున్నప్పటికీ వారిపై బలవంతంగా, టియర్‌గాస్ ప్రయోగించారు. నీటి ఫిరంగులతో పోలీసులు దాడిచేశారు. ఈ దాడిని సమాజంలోని అన్నివర్గాలు ఖండించాయి. హర్యానా రైతాంగంపై పోలీసుల అణచివేతకు నిరసనగా అక్టోబర్ 9న పంజాబ్‌లో 2 గంటలు జాతీయ రహదారులను అడ్డుకోవాలని పిలుపిచ్చాయి. కేంద్రప్రభుత్వ అధికారుల చర్చల ఆహ్వానాన్ని వారు తిరస్కరించారు. ఆందోళనను తీవ్రతరం చేయడానికి సంఘాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఫిరోజ్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద కిసాన్ సంస్థలు నిరవధిక నిరసన ధర్నా నిర్వహించాయి.

కేంద్రం ఆమోదించిన ప్రజావ్యతిరేక వ్యవసాయ చట్టాలను రాష్ట్రప్రభుత్వం తిరస్కరించాలని, ఇందుకోసం అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడానికి రాష్ట్ర అసెంబ్లీ సమావేశం ఏర్పాటుకు పంజాబ్ ప్రభుత్వానికి రైతుసంఘాల తరపున 7 రోజుల సమయం ఇచ్చారు. పంజాబ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అక్టోబర్ 19న అసెంబ్లీని అత్యవసరంగా సమావేశపరుస్తున్నట్లు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రకటించాడు.

పంజాబ్‌లో ఇది వరి కోత కాలం, అయినా కూడా ప్రజలు రైల్వేస్టేషన్లు, ట్రాకులు, కార్పొరేట్ మాల్స్, టోల్‌ప్లాజాలు, అంబానీ పెట్రోల్ బంకులు, గోడౌన్లు, అంబానీ యొక్క ఇతర వెంచర్లు, అదానీల ఇతర కార్పొరేట్ల దుకాణాల వద్ద రాత్రిపూట కూడా ధర్నాల్లో పాల్గొంటూ నిరసిస్తున్నారు. వారు అంబానీ, అదానీ, పతంజలి దుకాణాలు, మాల్స్, కార్పొరేట్‌ల గోడౌన్‌లవద్ద పగలు, రాత్రి కాపుగాసి బలవంతంగా మూసివేశారు. రిలయన్స్ యాజమాన్యంలోని అన్ని పెట్రోల్ బంకులను మూసివేశారు, పగలు-రాత్రి పికెట్‌లు నిర్వహిస్తున్నారు. పిలుపిస్తే జాతీయ, రాష్ట్ర రహదారులను మూసివేయగలుగుతున్నారు. అన్ని తరగతుల ప్రజలు అంటే కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, మహిళలు, వ్యాపారులు, చిన్న దుకాణదారులు, మండి కమిషన్ ఏజెంట్లు వీరితోపాటు ఇప్పుడు తాజాగా పిల్లలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు అవుతున్నారు. తాజాగా 142 మంది ప్రముఖ కవులు, రచయితలు తమ సంతకాలతో మద్దతు ప్రకటించారు. పంజాబ్‌లో పూర్తిగా, హర్యానాలో కొంతవరకు రైతాంగ ఉద్యమం కొనసాగు తున్నది. కర్ణాటకలో సెప్టెంబర్ 28న పూర్తిబంద్ చేశారు. 25 బంద్ పిలుపుని విజయవంతం చేసినట్లుగానే దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఫాసిస్టు తరహా ప్రజావ్యతిరేక విధానాలను, పన్నాగాలను ఓడించడానికి ఐక్యంగా పోరాడటం ఒక్కటే పరిష్కారం.